క్లుప్తంగా

పరామర్శ



కృష్ణంనాయుడును పరామర్శించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ఇటీవల గుండెపోటుకు గురై పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోదరుడు గరివిడి మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొనిసి కృష్ణంనాయుడును జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్‌రావు(చిన్నశ్రీను) బుధవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి హేయమైన చర్య



బర్రి చిన్నప్పన్న

విజయనగరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కారుపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న పేర్కొన్నారు. రమేష్‌యాదవ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అధికార దర్పంతో టీడీపీ నాయకులు నీచమైన సంస్కృతికి దారితీయటం సిగ్గుచేటన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు ప్రజలే నిర్ణయిస్తారన్నారు. పాలనలో వైఫల్యం చెందిన టీడీపీ నాయకులు భవిష్యత్ కళ్ల ముందు కనపడే సరికి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వారి చేష్టలు పరాకాష్టకు చేరుకుంటున్నాయని, త్వరలో పతనం తప్పదని హెచ్చరించారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

నేడు చేనేత దినోత్సవ కార్యక్రమం

విజయనగరం అర్బన్: జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని రాజాంలో గురువారం నిర్వహించనున్నట్టు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి కల్యాణ మండపం వరకు హ్యాండ్‌లూమ్ వాక్ నిర్వహిస్తామని అక్కడ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికులను సన్మానించనున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించే ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2015 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వివరించారు.

డాక్టర్ శశిభూషణరావుకు 'బెస్ట్ బుక్ ఆఫ్ ది వరల్డ్' అవార్డు



విజయనగరం అర్బన్: సత్యగ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావుకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ సంస్థ ప్రకటించిన 'రవీంద్రనాథ్ ఠాగూర్ సమ్మాన్ 2025'కింద 'బెస్ట్ బుక్ ఆఫ్ ది వరల్డ్' అవార్డు ఆయనకు దక్కింది. ఆయన రచించిన 'సాఫ్ట్ స్కిల్స్: నావిగేటింగ్ ది పాత్– కీ స్కిల్స్ ఫర్ ట్రాన్స్‌ఫరింగ్ ఫ్రమ్ క్లాస్ రూమ్ టు బోర్డ్ రూం' అనే పుస్తకానికి ఈ అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో శశిభూషణరావు తెలిపారు.

'అంగన్‌వాడీ'లకు యాప్ కష్టాలు

- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు ఆపసోపాలు
- సరిగా పని చేయని బాలసంజీవిని, పోషణ ట్రేకర్ యాప్‌లు
- పని చేయని సెల్‌ఫోన్లు వద్దని అంగన్‌వాడీల ఆందోళన



సక్రమంగా పని చేయని సెల్‌ఫోన్‌లు వద్దని భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పూసపాటిరేగ : అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తెచ్చిన యాప్‌లతో అష్టకష్టాలు పడుతున్నారు. ముఖచిత్ర గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. నాసిరకం 2 జీ సిమ్‌లు వున్న సెల్‌లు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చి ట్రాక్ చేయమనడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికే సిగ్నల్ క్యాచ్ చేయని సెల్‌ఫోన్‌లు మాకొద్దు అని భోగాపురం సెక్టారు పరిధి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖచిత్ర గుర్తింపు వేయాలని కార్యకర్తలు వాపోతున్నారు. గంటల కొద్దీ ప్రయత్నం చేసినా ట్రాక్ కాకపోవడంతో అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

లబ్ధిదారులకు బాల సంజీవిని, పోషణ పదార్థాలు అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారులకు ఫేస్ గుర్తింపు యాప్‌లో నమోదు చేయాలి. కానీ అక్కడ నుంచే ఇబ్బందులు ప్రారంభం అవుతున్నాయి. ప్రభుత్వం బాలసంజీవిని ద్వారా ముఖ గుర్తింపుతో వివిధ రకాల సరుకులు అందిస్తుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనలను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లను వినియోగించాల్సి వస్తుంది. ఈ విధానంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీహెచ్‌ఆర్ కింద నెలకు రెండు సార్లు ఇంటికే పోషకాహారం పంపిణీ చేసే వారని లబ్ధిదారులు చెబుతున్నారు. తాజా పరిస్థితిపై ప్రభుత్వానికి నిరసనలు తెలియజేసి చెప్పినప్పటికి ఎటువంటి ఫలితం లేదని కార్యకర్తలు అంటున్నారు. యాప్‌ల నిర్వహణతో పాటు రికార్డులు నిర్వహణ వలన చిన్నారులకు బోధించే ప్రాథమిక విద్యకు ఆటంకం కలుగుతోందని అంటున్నారు. ప్రీ స్కూల్ విద్యార్థుల నమోదు, సరుకులు నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పనిచేయని సెల్‌ఫోన్‌లు ఇచ్చి ఆందోళన కలిగిస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కోల్పోతున్నాం..

యాప్ కష్టాలతో రేషను కోల్పోతున్నాం. యాప్ ట్రాక్ చేయడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. సిగ్నల్ సమస్యతో పాటు నాసిరకం సెల్‌ఫోన్‌ల సరఫరా తదితర కారణాలతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే అధికారులు స్పందించి ఉపయోగకరమైన సెల్ ఫోన్‌లు లేదా ట్యాబ్‌లు సరఫరా చేయాలి.

– ఆదిలక్ష్మి, బాలింతరాలు, పూసపాటిరేగ

సిగ్నల్ లేక అవస్థలు

యాప్ ట్రాక్ చేయడానికి సిగ్నల్ లేకపోవడంతో లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా సరఫరా జరగడం లేదు. ఫోన్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. తక్షణమే అధికారులు సాంకేతికతతో కూడిన సెల్‌ఫోన్‌లు లేదా ట్యాబ్‌లు అందజేయాలి.

– అంగన్‌వాడీ కార్యకర్త, పూసపాటిరేగ మండలం

బంగారు కుటుంబాల జాబితాలో..

టీడీపీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రాజేష్

- పేదల పేరిట సొంత పార్టీ వారిని ధనవంతులు చేయడమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రాజేష్

విజయనగరం: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామంటున్న పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే పీ–4 కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల పేర్లే జాబితాలో చేర్పించారని, మరి కొందరు ఇప్పటికే తయారు చేసిన జాబితాలో పేర్లు మార్చాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్ ఆరోపించారు. ఈ నెల 19 నుంచి అమలు చేయతలపెట్టిన కార్యక్రమంలో అర్హులైన పేదవారి కన్నా రూ.కోట్లాది విలువ చేసే ఆస్తులున్న వారి పేర్లు, రూ.కోట్లు సంపాదించిన వారి పేర్లతో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు జాబితాలో ఉంటడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీ–4 కార్యక్రమం పేరిట ధనవంతులను మార్గదర్శులుగా ఎంపిక చేసి వారి ద్వారా పేదలను ధనవంతులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వం కార్యక్రమం లోపాభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6,776 మందిని పీ–4 కింద ఎంపిక చేసినట్లు అధికార యంత్రాంగం జాబితా విడుదల చేయగా... అందులో 50శాతంకు పైగా లబ్ధిదారులు అనర్హులేనని చెప్పారు. పేదలకు న్యాయం చేయకుంటే బాధ్యత గల ప్రతిపక్షంగా పోరాటం చేస్తామన్నారు. పీ–4 కార్యక్రమం అమలుకు ధనవంతులైన మార్గదర్శకులు ముందుకు రాకపోవటంతో ఆ భారాన్ని సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులపై మోపటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉద్యోగులను బలిపశువులుగా మార్చటం ప్రభుత్వానికి తగదన్నారు. దత్తత తీసుకోని ఉద్యోగులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. పార్టీ నాయకులు బొంగ భానుమూర్తి, కార్పొరేటర్‌లు అల్లు చాణక్య, జీవీ.రంగారావు, గాదం మురళి, ఆదిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి గణేష్, ఇసరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా నగరాన్ని తీర్చిదిద్దుతాం

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

విజయనగరం: ఆగస్టు 15 నుంచి నగరంలోని అన్ని సచివాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్టు విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, అందుకు సన్నాహకంగా ఆగస్టు 15వ తేదీ నుంచి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు సమాయత్తమవుతున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణ శతశాతం జరిగే విధంగా చూడాలన్నారు. హోం కంపోస్ట్‌పై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. మిద్దె పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. ఈ నెలలో 50 వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. ఎస్బీటీ మార్కెట్లో ప్రతి దుకాణానికి డీ–ఓ ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా విధించాలన్నారు. నిరాకరించిన దుకాణాలను మూసి వేయించాలని, సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏడాది కూటమి పాలన ఫెయిల్

- బాబు ష్యూరిటీ – గ్యారంటీ మోసం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు



14వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలతో స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు



మండలంలోని రాకోడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ తదితరులు



42వ డివిజన్‌లో మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

విజయనగరం: ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం బండారం ఏడాది కాలంలోనే బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు దుయ్యబట్టారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14, 48, 49, 34 డివిజన్‌లలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని మోసకారి చంద్రబాబు పాలనపై ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం వాటిని పార్టీ నాయకులు ఇంటింటికి పంపిణీ చేశారు. చంద్రబాబు ప్రతి సారి ఎన్నికలకు ముందు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించటం అలవాటుగా మార్చుకున్నారని విమర్శించారు. ఏడాదిలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో కొన్నింటిని మాత్రమే అరకొరగా అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దాన అప్పారావు, పార్టీ నాయకులు మారం బాలబ్రహ్మారెడ్డి, అవనాపు లక్ష్మణరావు, జి.ఈశ్వర్ కౌశిక్, కాళ్ల సూరిబాబు, కనుగుల రాజా, జమ్ము మధుసూదన్, మొయిద ఆదిబాబు, బూడి రాంబాబు, బాలి ప్రతాప్, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో..

నగరంలోని 42వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకత్వం ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను, మోసాన్ని వివరించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక వార్డు ఇన్‌చార్జి పిన్నింటి సూర్యనారాయణ, మహిళా నాయకులు ఉషారాణి, అనూష, నందిని, జ్యోతి, సుజాత, ఉష, పరమేశ్వరి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని రాకోడు గ్రామంలో..

మండలంలోని రాకోడు గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు ఇచ్చిన హామీలు వాటి అమలు తీరుపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలను పంచిపెట్టారు. విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాధ్, జిల్లా ఉద్యోగులు పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోలా మన్మధకుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్యప్రకాశరావు, సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్పీల పాత్ర కీలకం



బదిలీ అయిన మహిళ పోలీసులతో సీఐ తదితరులు

నెల్లిమర్ల: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో ఎంఎస్పీల పాత్ర ఎంతయినా ఉందని భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ అన్నారు. నెల్లిమర్ల మున్సిపాలిటీ, మండలానికి చెందిన 21 మంది మహిళా పోలీసులకు తాజాగా బదిలీ అయ్యింది. బదిలీ అయిన వారికి స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సీఐ రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా మహిళా పోలీసు వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ సులువైందన్నారు. కొత్తగా బదిలీపై వెళ్లే సచివాలయాల్లో మంచి సేవలందించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఏఎస్‌ఐలు సతీష్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితాకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నెల్లిమర్ల: కచ్చితమైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, నెల్లిమర్ల తహసీల్దార్ కె శ్రీకాంత్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు ఆన్లైన్ ద్వారాగాని నేరుగాగాని బీఎల్‌వోల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటే మార్పు అనివార్యమైతే ఆ వివరాలు తెలియజేయాలని సూచించారు. ఒకే పోలింగ్ స్టేషన్లో 1200 మంది ఓటర్లకు మించి ఉంటే ఆ పోలింగ్ స్టేషన్‌ను విభజించి, అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీటీ వివిఆర్. జగన్నాథరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గేదెల రాజారావు, పతివాడ రాజేష్, మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, కనకల పద్మనాభం, ఎరుకొండ వెంకటరావు, ఎన్నికల విభాగం సిబ్బంది సత్తిబాబు, భాస్కరరావు, మహేష్, మధు, పైడినాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఫాం పాండ్స్‌పై ప్రత్యేక దృష్టి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి

మెరకముడిదాం: ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే ఫాం ఫాండ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులకు నిర్వహిస్తున్న ఎస్ఎంఎంఎస్–2.0 పై శిక్షణ, సమీక్ష కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, చెరువు గట్లు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడంపై పలు సూచనలు చేశారు. అలాగే చేపలు, కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ కామేశ్వరరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నరేంద్ర కుమార్, పలువురు సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మహిళ అరెస్టు

పూసపాటిరేగ: అనధికార మద్యం దుకాణాలపై (బెల్ట్ షాపులపై) దాడుల్లో భాగంగా పూసపాటిరేగ మండలం గౌతుల చోడవరం గ్రామం మైలాన్ జంక్షన్ దరిలో ఒక మహిళను తొమ్మిది మద్యం బాటిల్స్‌తో అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెల్ట్ షాపులు నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని కోరారు. బెల్ట్ షాపుల సమాచారాన్ని భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కి తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్, కానిస్టేబుల్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు చెత్తబుట్టల అందజేత



వీధి విక్రయదారులకు అందజేసిన చెత్తబుట్టలు

విజయనగరం: వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు ప్రజారోగ్య సిబ్బంది చెత్త బుట్టలను బుధవారం అందజేశారు. గంటస్తంభం నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ఉన్న వీధి విక్రయదారులకు, తోపుడుబళ్ల వర్తకులకు, చిరు వ్యాపారులకు చెత్త బుట్టలను అందించి ఇక నుంచి వ్యర్థాలను ఆయా బుట్టలలో వేయాలని సూచించారు. ఇక నుంచి ఆయా బుట్టల్లో మాత్రమే చెత్తలు వేయాలని చెప్పారు. లేకుంటే ఆయా ప్రాంతం నుంచి చిరు వ్యాపారులను ఇతర ప్రాంతాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. మన ప్రాంతాన్ని మన నగరాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ఉద్దేశం ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు.

పొదుపు, రుణాలపై ప్రగతి నివేదికలు

- డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్

గజపతినగరం: స్వయం సహాయక సంఘ సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై పొదుపు, రుణాలపై ప్రగతి నివేదికలు తయారుచేసుకోవాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రత్నాకర్ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు తప్పకుండా నెలకోసారి జియో ఫెన్సింగ్ ద్వారా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. పొదుపు, అప్పులు, తదితర అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం డీపీఎం లక్ష్మీనాయుడు మాట్లాడుతూ.. సూక్ష్మ రుణ ప్రణాళిక విధానం.. బ్యాంక్‌లు.. స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు ప్రణాళికాబద్ధంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.నారాయణరావు, వెలుగు సీసీలు మూర్తి, సత్యనారాయణ, రామునాయుడు, శేఖర్, కైలాస్, వీఓ అధ్యక్షులు, వీఓఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రత్నాకర్